క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ మారుమూల పంచాయతీ సాగేరివలస గ్రామంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక యువతకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

అరకులోయ రూరల్: మండలంలో మాడగడ పంచాయతీ బెంజిపూర్ గ్రామంలో లూథరన్ మిషన్ డైరెక్టర్, పాస్టర్ సంజీవ్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లతో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సువార్త కూటమి నిర్వహించారు. క్రీస్తు బోధనలు అచరణీయమన్నారు. దుస్తులు, కానుకలు అందజేశారు. పాస్టర్లు మదన్, ప్రభుదాష్, విజయ్‌కుమార్, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

సీఐగా స్వామినాయుడు బాధ్యతల స్వీకరణ



రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సీఐగా ఏ.స్వామినాయుడు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొయ్యూరు నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ బాజీలాల్ కొయ్యూరుకు బదిలీ అయిన సంగతి విధితమే. స్వామినాయుడు విలేకరులతో మాట్లాడుతు సారా నిర్మూలన, గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కమ్యూనిటి పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తు, ప్రజలతో సత్సంబంధాలను కలిగి ఉంటామన్నారు. శాంతి భద్రతల అంశంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ ఎస్.వెంకయ్య, అడిషనల్ ఎస్‌ఐ జాన్‌కుమార్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సీఐకు ఆహ్వానం పలికారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎటపాక: మండలంలోని పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రను శుక్రవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు ఆదినారాయణ, సీతాలక్ష్మి, డాక్టర్ ప్రత్యూష్, పార్టీ జిల్లా కార్యదర్శి రేవతి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలపై అప్రమత్తం



అవగాహన ర్యాలీలో విద్యార్థులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి ఆశ్రమ పాఠశాలలో కల్తీ సరకులు, వినియోగదారుల చట్టాలపై జిల్లా వినియోగదారుల సంఘం జిల్లా కార్యదర్శి డి.సంగీత ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిరాణ షాపులు, హోటళ్లలో, ఆశ్రమపాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మాంసం దుకాణాల్లో కల్తీ లేదా కాలం చెల్లిన ఆహారపదార్థాలను గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాజుబాబు, బాలరాజు, నరేష్, దొర, నాగార్జున పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు

అన్ని రోగాలకు ఒకే రకం గోళీలు ఇవ్వడం.. డాక్టరు ఎప్పుడొస్తారో తెలియదు.. ఏఎన్‌ఎంతోనే వైద్యం.. గత్యంతరం లేక అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారు..టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల దుస్థితి..అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా వైద్యానికి పెద్దపీట వేశారు. పేదలకు ప్రైవేట్‌కు దీటుగా కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందుతోంది. ప్రజల చెంతకే ఉత్తమ, నాణ్యమైన వైద్యం అందుతుండడంతో గిరిజనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇది కదా అభివృద్ధి



పీహెచ్‌సీలో బాలింత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

- నాడు–నేడుతో పీహెచ్‌సీల అభివృద్ధి
- ఆరోగ్య కేంద్రాలకు కొత్త రూపు
- గిరిజనుల చెంతకే కార్పొరేట్ వైద్యం



బర్త్ వెయింటింగ్ రూమ్‌లో గర్భిణికి ఆరోగ్య సూచనలిస్తున్న సిబ్బంది



ఆపరేషన్ థియేటర్

జి.మాడుగుల: గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత ఆరోగ్య భద్రత కల్పించటానికి ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసింది. ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి రోగులకు మరింత మెరుగైన నాణ్యత గల వైద్య సేవలు అందించటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. నాడు-నేడు పథకం ద్వారా ఆస్పత్రుల్లో అభివృద్ధి చేసి రోగులకు అవసరమైన వసతులు, సదుపాయాలు కల్పించింది. మండలంలో జి.మాడుగుల, గెమ్మెలి గ్రామాల్లో రెండు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో జి.మాడుగుల పీహెచ్‌సీ భవనం మరమ్మతులకు ప్రభుత్వం నాడు-నేడు పథకం క్రింద రూ.65లక్షలు నిధులు మంజూరు చేసింది. భవనానికి మరమ్మతులు చేసి కరెంట్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు, కుర్చీలు తదితర వసతులతో ఆధునీకరించారు.

◆ జి.మాడుగుల పీహెచ్‌సీని నాడు-నేడు పథకం కింద రూ.65లక్షలతో మరామ్మతులు పనులు చేపట్టారు.

◆ ఎహెచ్‌సీకు రోజుకు 150 నుంచి 200 మంది ఔట్ పేషంట్లు వస్తున్నారు.

◆ ఎహెచ్‌సీలో పూర్తిస్థాయిలో ద్దరు వైద్యాధికార్లుతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు.

◆ పీహెచ్‌సీలో రోగులకు ఇబ్బందులు లేకుండా అన్నిసదుపాయాలు ఉన్నాయి.

◆ పీహెచ్‌సీలో అత్యవసర కేసులుంటే వెంటనే మెరుగైన వైద్యానికి పెద్దాస్పత్రికి పంపిస్తున్నారు.

◆ జి.మాడుగుల పీహెచ్‌సీలో 9 గ్రామ సచివాలయాలు పరిధిలో 194గ్రామాలు, 27,000జనాభా

◆ గెమ్మెలి పీహెచ్‌సీలో 8 గ్రామ సచివాలయాలు పరిధిలో 134గ్రామాలు, 28,150జనాభా

◆ పీహెచ్‌సీలు–2

◆ జి.మాడుగుల పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది

వెద్యాధికార్లు–2,యుడీసీ–1,స్టాఫ్ నర్సులు–3,ఎంపీహెచ్‌వో–1,పీహెచ్‌ఎన్–1, హెచ్‌వీలు–2,ల్యాబ్ టెక్నీషియన్–1,పార్మసిస్టు–1,ఓటీ టెక్నీషియన్–1, ఏఎన్‌ఎంలు–16,ఎంఎల్‌హెచ్‌పీ–8, హెల్త్ అసిస్టెంట్‌లు–5, డ్రైవర్–1, వాచ్‌మేన్–1

◆ గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది

వైద్యాధికార్లు–2,యుడీసీ–1, హెచ్‌వీ–1,ఎంపీహెచ్ఎస్–1,ఎంపీహెచ్‌ఈవో–1, స్టాఫ్ నర్సుల–3, ల్యాబ్ టెక్నీషియన్–1, పార్మసిస్టు–1,హెల్త్ అసిస్టెంట్‌లు–7,ఏఎన్‌ఎంలు–7 ఉన్నారు.

సేవలివీ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థానిక పీహెచ్‌సీని అభివృద్ధి చేశారు. ఆరోగ్యపరీక్షలకు సంబంధించిన పరికాలు సమకూర్చారు.మాలేరియా, టైఫాయిడ్, హెచ్‌ఐవీ, సిక్వెల్,పచ్చకెమెర్లుకు, తదితర 14రకాలు పరీక్షలు నిర్వహిస్తారు.గైనిక్, ఆర్థోపెడిక్, ఎమర్జన్సీ, జనరల్ అన్ని రకాలు కేసులు ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. డెలివరీ రూమ్స్,ఫార్మాసీ రూమ్,మీటింగ్ హాల్, ఓపీ రూమ్,బర్త్ వెయింటింగ్ రూమ్, ఎంటినెటిల్ రూమ్,తాగునీటి సదుపాయం,మరుగుదొడ్లు వంటి సదుపాయాలు ఉన్నాయి.



జి.మాడుగుల పీహెచ్‌సీ



పీహెచ్‌సీలో కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్లు

మండలం: జి.మాడుగుల	
పంచాయతీలు:	17
గ్రామాలు:	328
జనాభా :	55,150
గ్రామ సచివాలయాలు:	18
పీహెచ్‌సీలు:	2

వైద్యసేవలు బాగున్నాయి



మతా శిశు సంరక్షణ కార్డు(ఎంసీపీ) ప్రకారం ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకొని మందులు పొంది, డాక్టర్, వైద్య సిబ్బంది ఇచ్చిన ఆరోగ్య సూచనలు, సలహాలు పాటిస్తున్నాను. క్రమం తప్పకుండా ప్రతీ నెల ఆశ, ఏఎన్‌ఎం సూచన మేరకు ఆస్పత్రిలో గర్భానికి సంబంధించిన పరీక్షలు చేయించుకుంటున్నాను. వైద్య సేవలు బాగున్నాయి. ఆరోగ్యం కూడా బాగుంది.

– వంచుర్ల చిలకమ్మ, లువ్వాసింగి గ్రామం

వైద్యుల ప్రత్యేక శ్రద్ధ



తలనొప్పి, జ్వరం, దగ్గు ఉండడంతో పీహెచ్‌సీకి వచ్చాను. డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు ఇచ్చి, ఒకటి, రెండు రోజుల తరువాత వచ్చి ఆరోగ్య పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పమని డాక్టర్ చెప్పారు. డాక్టర్ బాగానే పరీక్షించి, సేవలు బాగున్నాయి.డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో సేవలందిస్తున్నారు.

– తల్లాబు సుహాసిని, తాడివీధి గ్రామం, జి.మాడుగుల

మెరుగైన వైద్యం



గైనిక్, ఆర్థోపెడిక్, ఎమర్జన్సీ, జనరల్ అన్ని రకాలు కేసులు ఇద్దరు డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్నాం,కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. అత్యసరకేసులైతే పాడేరు, విశాఖ పట్నంలోని పెద్దాస్పత్రులకు మైరుగైన వైద్యం నిమిత్తం తరలించటం జరుగుతుంది.

– డాక్టర్ ఈ రవిచంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, జి.మాడుగుల

జగనన్నకు కృతజ్ఞతలు



గతంలో పీహెచ్‌సీకి రావటానికి భయంగా ఉండేది. ఏ రోగానికైనా ఒకటే మాత్ర ఇచ్చేవారు. వైద్యం కూడా అంతంతమాత్రంగా ఉండేది. నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు పెంచినందుకు జగనన్నకు కృతజ్ఞతలు. వైద్యం బాగుంది.జబ్బు తగ్గుతుందనే నమ్మకం పెరిగింది. వొంటి నొప్పులతో పీహెచ్‌సీకి వచ్చి డాక్టర్‌ను సంప్రదించాను. పరీక్షించి మందులు ఇచ్చారు.

–కోరాబు నాయుడు, చిట్టంపుట్టు గ్రామం

అన్ని వేళలా వైద్యం



జి.మాడుగుల పీహెచ్‌సీలో జ్వరం, టైఫాయిడ్, హెచ్‌ఐవీ వంటి 14రకాలు పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతీ రోజు 150–200మంది ఔట్‌పేషంట్స్ వస్తున్నారు. డాక్టర్లుతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్యం అందిస్తున్నాం.రోగులకు ఇబ్బందుల లేకుండా అస్పత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నాయి.

–డాక్టర్ టి.శశికాంత్, పీహెచ్‌సీ వైద్యాధికారి, జి.మాడుగుల

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సీఐ రమేష్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

జి.మాడుగుల: గిరిజన ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ రమేష్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలిసి శుక్రవారం సీఐ రమేష్‌కు శాలువా కప్పి, బొకేను అందించి ఘనంగా సన్మానించారు. అలాగే స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వారు శాలువ కప్పి సన్మానించారు. మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావం దెబ్బతిన్న వ్యవసాయ పంటల నష్టాలు, గ్రామాల్లో శాంతి, భద్రతలు, గంజాయి, సారాయి వంటి వాటిపై ప్రజాప్రతినిధులతో సీఐ చర్చించారు. గ్రామాల్లో ప్రశాంతతకు విఘాతం కలిగించే వారిపై నిఘా పెట్టటం జరుగుతుందన్నారు. ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉండి పోలీస్ సేవలందిస్తామని ఎటువంటి సమస్య, ఇబ్బందులు తలెత్తినా సమచారం అందించాలని ఆయన సూచించారు. మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్ రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు,ఎం చిలకమ్మ, సూరిబాబు,వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కె సత్యనారాయణ, చిట్టిబాబు,గంగరాజు, వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సీఐ రమేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం



చింతూరు మండలం పేగలో పత్తి పంటను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



వై.రామవరంలో దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో ఉషారాణి

చింతూరు: తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి అన్నారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి, పేగలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఎంపీపీ సవలం అమలతో కలసి వరి, పత్తి, మిరప తోటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు రైతులకు నష్టం చేకూర్చాయని , ఎవరూ అధైర్యపడవద్దని వారు భరోసా నిచ్చారు. పంటనష్టం వివరాలను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. వైస్ ఎంపీపీ యడమ అర్జున్, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, సర్పంచ్ చంద్రయ్య, ఉపసర్పంచ్‌లు బాబూరావు, విప్లవ్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ రామలింగారెడ్డి, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: తుఫాన్ కారణంగా మండలంలో నీటమునిగిన పంట నష్టం సర్వేను అధి కారులు వేగవంతంగా పూర్తిచేసారు. గత మూడు రోజులుగా మండలం లోని అన్ని గ్రామాల్లో ఒకపక్క తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, వారి సిబ్బంది, మరోపక్క వ్యవసాయశాఖ ఏఓ ఉషారాణి, వారి సిబ్బంది గ్రామాల్లో సర్వే నిర్వహించి వేగవంతంగా పూర్తి చేసారు. దీంట్లో బాగంగా శుక్రవారం వై.రామవరం, చుట్టుప్రక్కల గ్రామాల్లో తహసీల్దార్, వ్యవసాయ అధికారి సంయుక్తంగా పొలాల్లో తిరిగి సర్వే నిర్వహించారు. ఈసందర్బంగా తహసీల్దార్ మాట్లాడుతు నివేధికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఏఓ మాట్లాడుతు మండలంలో మొత్తం 1912 ఎకరాల్లో వరిసాగు చేయగా 65 ఎకరాలలో మాత్రమే పొలాల్లో పనలపై ఉందన్నారు. 1012 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా తుఫాన్ కారణంగా సగం పంట నేలకొరిగిందన్నారు. నీట మునిగిన వరిపంట మొలకలు రాకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయమని ఏఓ రైతులకు సూచించారు. పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

12న మండల సమావేశం

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సార్ల లలితకుమారి అధ్యక్షతన ఈ నెల 12న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వీరాకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావలని కోరారు.

బస్సు యాత్ర వాయిదా

ముంచంగిపుట్టు: హుకుంపేటలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర వాయిదా పడినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ చెప్పారు. జోలాపుట్టు పంచాయతీలో బస్సు యాత్ర వాయిదాపై శుక్రవారం గ్రామాల్లో గిరిజనులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల పంటలు పాడై రైతులు కష్టాల దృష్ట్యా బస్సు యాత్ర వాయిదా వేశామని, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఈ విషయం గమనించి, గ్రామాల్లో తెలియజేయాలని ఆయన కోరారు.

10న ప్రత్యేక వైద్య శిబిరం

రంపచోడవరం: మండల కేంద్రంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ తెలిపారు. గుండెకు సంబంధించిన వ్యాధులు, ఆయాసం, బీపీ, సుగర్, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్ , చర్మ వ్యాధు పిల్లల వ్యాధుల, సామాన్య రోగాలకు వైద్య సేవలు అందుతాయన్నారు .పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఐటీడీఏ పీవోకు వినతి

చింతూరు: తుఫాను బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు శుక్రవారం ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రంగా సర్వే చేయిచాలని, ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్, సురేష్, శ్రీనివాసరావు, రాజయ్య పాల్గొన్నారు.

11 నుంచి రిఫ్రెష్ శిక్షణ

అడ్డతీగల: గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు రిఫ్రెష్ శిక్షణ ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. స్థానిక వైటీసీ భవనంలో 11 న ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ప్రారంభమతుందన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరును శిక్షణలో తెలియజేస్తామన్నారు.గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొవాలన్నారు.

నేడు అంబలం పూజ

సాక్షి,పాడేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో శనివారం సాయంత్రం అయ్యప్ప స్వామి అంబలంపూజ నిర్వహిస్తున్నట్టు గురుస్వామి సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప, భవానీ,శివ మాలధారులు తరలిరావాలని కోరారు. ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు అన్నసమరాధన

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ మండపం వద్ద శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పరమేశ్వరరావు తెలిపారు. దాతలు కిరణా, ఇతరత్రా సామగ్రి అందజేయవచ్చన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మురళి

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట రైతు భరోసా కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలపై సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు మండలం జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. ఇందుకూరుపేట పీహెచ్‌సీకి కుక్క కాటు కేసులు ఎక్కువగా వస్తున్నాయని డాక్టర్ డేవిడ్ తెలిపారు. కొండమొదలు పీహెచ్‌సీకి విద్యుత్ సరఫరా సరిపోవడం లేదని డాక్టర్.శిరీష తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎంపీపీ తెలిపారు. ఎంపీడీవో రత్నకుమారి, వైస్ ఎంపీపీలు లక్ష్మికుమారి, మురళీ, బాబ్జీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రమేష్, నాయకులు

కొయ్యూరు: కొమ్మిక సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కొమ్మిక సచివాలయం పరిధిలో వివిధ పథకాలకు రూ.16.34 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, ప్రభుత్వ సేవలను వివరించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సచివాలయ కన్వీనర్ సుధాకర్, సర్పంచ్ సెగ్గే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కమతం అర్జమ్మ, జిల్లా ప్రచార కార్యదర్శి దోని బాబ్జీ, నేతలు సుర్ల లోవరాజు, శేఖర్,గంగారాజు, చల్లారావు,దేవుడు, సన్యాసిరావు, వనంబాబు తదితరులు పాల్గొన్నారు.